PRGI Reg No -“APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 43, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 03 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

### అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది
## ట్రంప్ వ్యాఖ్యలపై ధీటుగా స్పందించిన ఇరాన్



ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయి

తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదు

ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశాం

### భారత నౌకలకు డోకా లేదు..
## హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

“భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు“




భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ‘ఎక్స్‘ (ట్విట్టర్) వేదికగా ప్రకటన

### హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..
## 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు




ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది

భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం

## ఇరాన్ యుద్ధం నేపథ్యంలో
### ‘పొరుగుదేశం‘ దుస్సాహసానికి పాల్పడితే

రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక

పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయి

ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకుని భారత్‌పై అనాలోచిత ఆలోచన చేస్తే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుంది

పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్షంగా హెచ్చరించారు

పొరుగుదేశం ఉగ్రవాద చర్యలకు గతంలో ధీటుగా బదులిచ్చాం



ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో, పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకుని భారత్‌పై అనాలోచిత ఆలోచన చేస్తే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని అన్నారు. మిగతా..2లో



### అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. వాకౌట్ చేసిన వైసీపీ

అమరావతి: అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈరోజు రాజ్యసభలో చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేశారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. కాగా, రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా మారనుంది. సభలో 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. పది పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

# ఇక అమరావతికి తిరుగులేదు..
# రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది
## ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారు

- ఈ చారిత్రక విజయం వారికే అంకితం
- ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టం
- ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుంది
- “రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది



అమరావతి: రాజ్యసభలో అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని మిగతా..2లో




### రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి: హరీశ్ రావు ట్వీట్

- తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి
- నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారు
- రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారు
- రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారు

# తెలంగాణలో
# 2 లక్షల కొత్త పెన్షన్లు..

- ★ రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- ★ చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు
- ★ 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధం
- ★ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు
- ★ బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు
- ★ వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు




హైదరాబాద్: తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి మిగతా..2లో



### సమీకృత భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తాం

ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రభుత్వమిది

హైదరాబాద్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన ‘సమీకృత భూభారతి’ పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.



## ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం పూర్తయింది: చంద్రబాబునాయుడు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ‘ఎక్స్‘ వేదికగా ట్వీట్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1,372 మీటర్ల పొడవైన ‘డయాఫ్రం వాల్‘ నిర్మాణాన్ని ఇరిగేషన్ శాఖ తక్కువ సమయంలో పూర్తి చేసిందని ప్రశంసించారు. ఇందుకు ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు ఆయన అభినందనలు తెలిపారు. దీనికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డీ-వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ.1000 కోట్లు వెచ్చించి నిర్మించామని పేర్కొన్నారు. డయాఫ్రమ్ వాల్ పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పనులు వేగవంతమవుతాయని అన్నారు. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తిచేసి 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితమిస్తామని పునరుద్ఘాటించారు.

# అనిశ్చితికి తెరపడింది..
### అమరావతి ఏకైక రాజధానిగా నిలిచింది: డిప్యూటీ సీఎం పవన్

- ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ
- ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం
- పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించింది

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగింది



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు, పెద్దల సభలోనూ నెగ్గడంతో మిగతా..2లో

## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం

ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్

మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణం

“కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు.

తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి: సురేశ్‌రెడ్డి



ఢిల్లీ: కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా

## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది
# ట్రంప్ వ్యాఖ్యలపై ధీటుగా స్పందించిన ఇరాన్

ఢిల్లీ: అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

## హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..
# 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

ఢిల్లీ: ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.


## భారత నౌకలకు డోకా లేదు..
## హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

ఢిల్లీ: ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది. ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో దీఔ ్=, దీఔ జూవీ అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

## చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు..
## చరిత్రలో తొలిసారిగా నాసా కీలక నిర్ణయం

ఢిల్లీ: అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) మరో చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో తొలిసారిగా, లోతైన అంతరిక్షంలోకి (డీప్ స్పేస్) వెళ్తున్న తమ వ్యోమగాములకు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం నింగిలోకి దూసుకెళ్లిన ఆర్టెమిస్-2 మిషన్‌లో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మిషన్ ద్వారా మానవసహిత యాత్ర 50 ఏళ్లకు పైగా విరామం తర్వాత చంద్రుడి సమీపంలోకి వెళ్తోంది. రీడ్ వైస్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్‌లతో కూడిన నలుగురు వ్యోమగాముల బృందం, ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి రానుంది. ఈ ప్రయాణంలో తమ వ్యక్తిగత క్షణాలను, అద్భుతమైన దృశ్యాలను బంధించేందుకు వీరికి ఐఫోన్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. వ్యోమగాములు వినియోగించే పరికరాలను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. "మా వ్యోమగాములు తమ కుటుంబం కోసం ప్రత్యేక క్షణాలను బంధించుకోవడానికి, ప్రపంచంతో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు, వీడియోలను పంచుకోవడానికి అవసరమైన సాధనాలను అందిస్తున్నాం" అని ఆయన గతంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. అయితే, అంతరిక్ష నౌకలోని వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, డీప్ స్పేస్ ప్రయాణంలో ఈ ఫోన్లను పూర్తిగా 'ఏరోప్లేన్ మోడ్'లోనే ఉంచుతారు. అంటే ఇవి కేవలం హై-ఎండ్ కెమెరాలుగా మాత్రమే పనిచేస్తాయి. ప్రయాణ సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) మీదుగా వెళ్తున్నప్పుడు, అక్కడి వై-ఫైకి కనెక్ట్ అయి ఫోటోలు, ఈ-మెయిల్స్ పంపే అవకాశం ఉంటుంది. కానీ, వాయిస్ కాల్స్ చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన లైవ్ చిత్రాలను తీయడంతో పాటు ఇంతకుముందు మానవ కంటికి కనిపించని కొన్ని ప్రదేశాలను గమనించనున్నారు. అలాగే, లోతైన అంతరిక్షం నుంచి పాక్షిక సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించనున్నారు.

## ఇంధనం, గ్యాస్ మాత్రమే కాదు.. ఇరాన్ యుద్ధంతో
## మీ ఇంటర్నెట్‌కు కూడా ముప్పే.. ఎలాగంటే?




ఢిల్లీ: పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ కూటమి మధ్య జరుగుతున్న యుద్ధ ప్రభావం కేవలం పెట్రోల్, గ్యాస్ ధరలకే పరిమితం కావడం లేదు. ప్రపంచాన్ని నడిపిస్తున్న డిజిటల్ వ్యవస్థపైనా ఈ యుద్ధ ప్రభావం పడేలా ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సముద్ర గర్భంలోని ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లకు ముప్పు వాటిల్లితే, ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు స్తంభించిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో 95 శాతం సముద్ర గర్భంలోని 'కేబుల్స్' ద్వారానే నడుస్తుంది. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాలను కలిపే కీలకమైన కేబుల్స్ ఎర్ర సముద్రం, పర్షియన్ గల్ఫ్ గుండానే వెళుతున్నాయి. భారత్ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో దాదాపు 60 శాతం ముంబై నుంచి యూరప్‌కు ఈ మార్గం గుండానే వెళుతుంది. ఒకవేళ యుద్ధం కారణంగా ఈ కేబుల్స్ దెబ్బతింటే భారత్‌లో ఇంటర్నెట్ వేగం దారుణంగా పడిపోవడమే కాకుండా, సేవలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఈ కేబుళ్లు దెబ్బతింటే డేటా ట్రాఫిక్ ఇతర మార్గాలకు మళ్లడంతో ఇంటర్నెట్ వేగం గణనీయంగా తగ్గుతుంది. యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విఫలమయ్యే అవకాశాలున్నాయి. అమెజాన్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థల క్లౌడ్, ఏఐ సేవలు కూడా మందగిస్తాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్త క్లయింట్లతో పనిచేసే భారత ఐటీ పరిశ్రమకు బిలియన్ల డాలర్ల నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఇరాన్ మద్దతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇప్పటికే ఎర్ర సముద్రంలోని కేబుళ్లను ధ్వంసం చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. గతంలో నౌకల లంగర్లు తగిలి కొన్ని కేబుల్స్ దెబ్బతిన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం తీవ్రమైతే వీటిని ఉద్దేశపూర్వకంగానే లక్ష్యం చేసుకుంటారని రక్షణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత టెలికాం శాఖ అప్రమత్తమైంది. ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ వంటి టెలికాం సంస్థలను ఆదేశించింది.

# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

మొదటి పేజి తరువాయి

చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

# ఇక అమరావతికి తిరుగులేదు..
# రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది

మొదటి పేజి తరువాయి

భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.

# ఇరాన్ యుద్ధం నేపథ్యంలో
## 'పొరుగుదేశం' దుస్సాహసానికి పాల్పడితే

మొదటి పేజి తరువాయి

కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్షంగా హెచ్చరించారు. పొరుగుదేశం ఉగ్రవాద చర్యలకు గతంలో ధీటుగా బదులిచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడితే ఊహించనిరీతిలో భారత్ స్పందిస్తుందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని కూడా ఆసక్తికర వ్యాఖ్య చేశారు. యూరి దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గామ్ దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా స్పందించిందని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# అనిశ్చితికి తెరపడింది..

మొదటి పేజి తరువాయి

అమరావతికి రాజధానిగా తిరుగులేని చట్టపరమైన హోదా లభించింది. ఈ చారిత్రక పరిణామం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "త్యాగాల పునాదుల నుంచి, ఆశలు మోసుకొచ్చిన కన్నీటి నుంచి, అనిశ్చితిని భరించిన నిశ్శబ్దం నుంచి అమరావతి నేడు కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ గౌరవంగా నిలబడింది" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి, పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, ఈ విజయం ఎన్డీఏ ప్రభుత్వంపై చెక్కుచెదరని విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదని తెలిపారు. అమరావతి ఆత్మ రైతుల త్యాగంలోనే ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "33,000 ఎకరాలకు పైగా భూములను రైతులు బలవంతంగా ఇవ్వలేదు. భవిష్యత్‌పై, ఒక దార్శనికతపై నమ్మకంతో ఇచ్చారు. ఈ రోజు వారి నమ్మకాన్ని గౌరవించగలిగాం" అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్రానికి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులు అర్పించారు. గత కొన్నేళ్లుగా అమరావతిని అనిశ్చితిలోకి నెట్టారని, విధానాలు మార్చి రైతులను మోసం చేశారని, ప్రజల ఆకాంక్షలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ అనిశ్చితికి తెరపడిందన్నారు. ఇది కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని పేర్కొన్నారు. స్పష్టమైన దార్శనికతతో అమరావతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రతి కీలక సమయంలో రాష్ట్రానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై అమరావతి స్థిరత్వం, ప్రగతికి చిహ్నంగా, తరతరాలకు వారధిగా నిలిచే ప్రజల రాజధాని అవుతుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు.

# కాళేశ్వరంపై రాజ్యసభలో
# కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం

మొదటి పేజి తరువాయి



మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు. "కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు" అని కిషన్‌రెడ్డి అన్నారు.

తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి: సురేశ్‌రెడ్డి

కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. " ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

# రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి,
# పలికించింది రేవంత్ రెడ్డి: హరీశ్ రావు ట్వీట్

హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బిజెపి ప్రభుత్వమే అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు. ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది వారి కుట్రకు నిదర్శనమని విమర్శించారు.

రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే ఈరోజు కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? అని నిలదీశారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధమో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం వచ్చేందుకు మీకు దమ్ముందా? అని సవాల్ చేశారు. మీరు క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా? అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీ బిజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా? లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం వల్ల ఉపయోగంలేదని కిషన్ రెడ్డి గొంతు చించుకున్నారని ఆరోపించారు. కానీ గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధమా లేక అవివేకమా అని ప్రశ్నించారు. నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' రిపోర్ట్ ప్రకారం, "2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం ఉంది. 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే" అని కుండబద్దలు కొట్టిందని అన్నారు. ఇది కిషన్ రెడ్డి కళ్లకు కనబడటం లేదా అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చెప్పింది మాత్రమే ఆయన చెవుల్లోకి వెళుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి కాదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని మా ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడితే, మీరు దాన్ని సమర్థించకపోగా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది మాత్రం రేవంత్ రెడ్డేనని వ్యాఖ్యానించారు. 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని వినిపించకపోవడం సిగ్గుచేటు హరీశ్ రావు అన్నారు.

# మరావతికి చట్టబద్ధత.. రాజధానిలో సంబరాలు..
## ఉద్దండరాయుని పాలెంలో రైతుల సభకు
## సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించడంతో రాజధాని ప్రాంత గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని రైతులు, మహిళలు నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పాల్గొన్నారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడైతే రాజధానికి శంకుస్థాపన చేశారో, అదే ఉద్దండరాయుని పాలెంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగాల మధ్య సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు రైతులు, మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇది దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని, ప్రజాస్వామ్య గొప్పదనాన్ని, ప్రజా సంకల్పాన్ని చాటి చెప్పిందని అభివర్ణించారు. "అమరావతి చరిత్ర శాశ్వతం, అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని ప్రజా రాజధానిని సాధించుకున్నాం. ఇది ప్రజల విజయం" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ బిల్లుకు సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో పాటు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్క వైసీపీ మినహా అందరూ అమరావతికి అండగా నిలిచారని గుర్తుచేశారు.

అమరావతిని స్మశానం అన్న వాళ్లు అడ్రస్ లేకుండా పోయారు: చంద్రబాబు

గత ప్రభుత్వ తీరుపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అమరావతిని స్మశానం అన్నారు, కానీ ఇవాళ పార్లమెంటులో దానికి తిరుగులేని శాసనం చేశాం. రాజధానితో మూడు ముక్కలాట ఆడిన వాళ్లు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారు" అని విమర్శించారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇస్తే, ప్రజా వేదికను కూల్చి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇంత జరిగినా వైసీపీకి బుద్ధి రాలేదని, పార్లమెంటులో బిల్లుపై చర్చ జరుగుతుంటే వారి ఎంపీలు వాకౌట్ చేశారని, ప్రజలు ఆ పార్టీని బ్లాక్ అవుట్ చేయాలని పిలుపునిచ్చారు. వారి 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదన అర్థం కాలేదని, వైసీపీవన్నీ బుద్ధిలేని వ్యాఖ్యలని, దుర్మార్గపు ఆలోచనలని దుయ్యబట్టారు.

ఇది ప్రజా విజయం, రైతుల త్యాగం శాశ్వతం

రాజధాని కోసం రైతులు, మహిళలు 1631 రోజుల పాటు చేసిన వీరోచిత పోరాటాన్ని చంద్రబాబు స్మరించుకున్నారు. నాడు ఉద్యమ శిబిరాలకు తాను సతీసమేతంగా వచ్చానని, రైతుల కష్టాలు చూసి తన భార్య భువనేశ్వరి చలించిపోయి తన చేతి గాజులను విరాళంగా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. పవన్ కళ్యాణ్ ముళ్ల కంచెలు దాటుకుని వచ్చి మద్దతు తెలిపారని, తాను స్వయంగా జోలె పట్టి విరాళాలు సేకరించానని చెప్పారు.

శంకుస్థాపన ప్రదేశంలో చంద్రబాబు దంపతుల ప్రత్యేక పూజలు.. సాష్టాంగ ప్రణామం

రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా హామీ ఇచ్చారు. "అమరావతి ఇక అన్‌స్టాపబుల్. ఇది అద్వితీయం, అజేయం, అజరామరం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు దంపతులు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. పవిత్ర మట్టి, జలాలు ఉన్న వేదిక వద్ద సాష్టాంగ ప్రణామం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి దీప హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం రాజధాని చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచిపోయింది.

## ఆ అధికారుల నిర్బంధం తెలియదు..
## పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ



ఢిల్లీ: మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)పై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని మమతా బెనర్జీ అన్నారు. మాల్దాలో జరిగిన అధికారుల నిర్బంధం ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు. తనకు అర్ధరాత్రి సమయంలో ఒక జర్నలిస్టు ద్వారా నిర్బంధం విషయం తెలిసిందని వెల్లడించారు.

## మోకాళ్ళు, తుంటి నొప్పితో బాధ బాధపడుతున్న వారికి అందుబాటులో వైద్యం

**అతి తక్కువ ఖర్చుతో యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ లో రోబోటిక్ కీలు మార్పిడి శస్త్రచికిత్స**




ఖమ్మం, నేటి శుభోదయ :::; ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోబోటిక్ కీలు మార్పిడి శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 15 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ కి చెందిన ప్రముఖ కీలు మార్పిడి శస్త్రచికిత్స అర్థరోస్కోపీ, ట్రామా నిపుణులు డా.అభిషేక్ బర్లీ మాట్లాడారు. ఇటీవల కాలంలో ఖమ్మం ప్రాంతం నుండి పి సురోచనా , టీ దేవచ్చమ్మ విపరీతమైన మోకాళ్ళ నొప్పితో, బి రాజు తుంటి నొప్పితో బాధపడుతూ యశోద హాస్పిటల్ సోమాజిగూడ కి రావడం జరిగిందని తెలిపారు . వారికి సర్జికల్ ప్రొఫైల్ చేసిన తర్వాత అధునిక సదుపాయలతో అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించామని తెలిపారు . ఒక్కసారి మోకాళ్ళు లేదా తుంటి మార్పిడి చేయించుకుంటే సుమారుగా 30 సంవత్సరాలు వరకు మళ్లీ ఆపరేషన్ తో పని లేకుండా ఉంటుందన్నారు . ఒక నెల వరకు ఫిజియోథెరపీ చేపించుకోవాలని సూచించారు . బాడీ ఫిట్నెస్ ను బట్టి ఒకేసారి రెండు మోకాళ్ళకు ఒకసారి ఆపరేషన్ చేయొచ్చని పేర్కొన్నారు . చాలామంది ఆపరేషన్ ఫెయిల్ అయిద్దామో దాని వల్లన అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందేమో అని భయపడతారు, అలాంటి అపోహలు ఏమి పడద్దని ఆపరేషన్ చేసిన తర్వాత 24 గంటల్లో లేచి నడవచ్చని అన్నారు . ఆపరేషన్ చేయించుకున్న వారు కన్సేషన్ డాక్టర్ కొరకు హైదరాబాద్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఖమ్మం చుట్టుపక్క పరిసరాల ప్రాంత వాసులకు ప్రతి నెల మొదటి గురువారం ఎమ్మెస్ (ఆర్థో) డాక్టర్ అందుబాటులో ఉంటారని కావున సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ జి విక్రమ్ కుమార్ , శ్రీధర్ రావు , బాల కృష్ణ , నవీన్ , నాగార్జున పాల్గొన్నారు .

## ముగిసిన ఐదేళ్ల పాలన పెద్దార్కూర్ పంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం



కూనవరం, ఏప్రిల్ 2 (నేటి శుభోదయం):ప్రజా సేవలో ఐదేళ్ల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న కూనవరం మండలంలోని పెద్దార్కూర్ పంచాయతీ పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు పలికారు. పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం నాడు సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు.(అభివృద్ధే ధ్యేయంగా సాగిన ప్రయాణం ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ, తన ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చినట్లు పేర్కొన్నారు.రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామ శ్రేయస్సు కోసమే పని చేశాం. ఐటీడీఏ కార్యాలయాలు, కలెక్టరేట్ చుట్టూ తిరిగి పంచాయతీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించు కొన్నాము గ్రామంలోని తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచ్ వివరించారు. గత ఐదేళ్లలో నీటి ఎద్దడి



లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ పనులను కొబ్బరికాయ కొట్టి మరీ ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం గ్రామ ప్రజలందరికీ నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందుతోందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీటీసీ అమ్మాజి, చిచ్చడి విజయలక్ష్మిలతో పాటు వార్డు సభ్యులు రాములమ్మ, సురేష్, రాజమ్మ, లక్ష్మి, రమేష్, లచ్చయ్య, కమల, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది కూడా పాల్గొని పాలకవర్గం చేసిన సేవలను కొనియాడారు. ఐదేళ్ల పాటు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మౌలిక సదుపాయాల కల్పనలో పెద్దార్కూర్ పాలకవర్గం తనదైన ముద్ర వేసింది. ఈ వీడ్కోలు సభ గ్రామస్తుల మధ్య ఒక ఆత్మీయ వేడుకలా సాగింది

## "అగ్ని ప్రమాద బాధితులకు గ్లోబల్ అలుమ్ని వెల్ఫేర్ ట్రస్టుద్వారా చేయుత



గోకవరం-నేటిసుబోదయ.:గోకవరంమండలం రంప ఎర్రంపాలెం గ్రామంలోని గంగా భవాని నగర్ శివారులో కుంజాల రఘుపతి, కుటేటి దుర్గాలకు చెందిన రెండు తాటకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధం అయ్యాయి.గ్లోబల్ అల్యూమి వెల్ఫేర్ ట్రస్టు ద్వారా యువత 19500రూపాయల డోనార్స్ నుంచి వచ్చిన సొమ్ముతో వంటసామాన్లు,బట్టలు, క్యాష్ బాధితులకు అందజేసి, వారిని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో , ట్రస్టు ప్రెసిడెంట్ కాకర విష్ణు, గౌరవ సభ్యులు సత్యం పెద్దబ్బులు, పాటి అప్పలరాజు (తాతీలు),నారా ప్రసాద్,పప్పు రాఘవులు,పెదిరెడ్ల రాజ, గుల్లిశీకలనాని,సురపరెడ్డి రామక్రిష్ణ, తిరుపతి బాబి,దర్శిపూడి వెంకన్న, కాళ్ళ దుర్గా ప్రసాద్,పంతం వీరబాబు, చెక్క గణేష్ పాల్గొన్నారు.

## నడకతో ఆరోగ్యానికి ఎంతో మేలు




గోకవరం-నేటిసుబోదయ.:నేషనల్ వాకింగ్ డే సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ది పిఎంపి అసోసియేషన్ గోకవరం మండలం ఆధ్వర్యంలో బుధవారం గోకవరం లో మార్నింగ్ వాక్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహదారి పై వెళ్ళే పాదచారులకు నడకపైఅవగాహన కల్పిస్తూ ప్రతి రోజూ నడకను అలవాటు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని,మధుమేహం, క్యాన్సర్ వంటి జబ్బులను నివారించవచ్చని తెలిపారు.దీని ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి మెదడు చురుగ్గా పనిచేస్తుందని కనుక ప్రతి ఒక్కరూ రోజూ 30-60 నిమిషాలు నడక సాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా కోశాధికారి పి చిన్ని,మండల కార్యదర్శి వా. సూరిబాబు, కోశాధికారి +. లాజర్, వైస్ ప్రెసిడెంట్స్ ఎం. నాగేశ్వరావు, జి. నాని, సహాయ కార్యదర్శిలు జి. వెంకటేష్,జె. మూర్తి, ఐ. నాగేశ్వరావు, గోకవరం మండల అసోసియేషన్ సభ్యులు టి.ఆంజనేయులు, జె. శర్మ, కె. జ్యోతి పాల్గొన్నారు.

## అహోబిలం పారువేట ఉత్సవంకు యూనెస్కో గుర్తింపు కోసం పార్లమెంట్ లో గళం విప్పిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: గురువారం భారత పార్లమెంట్ లో అహోబిలం పారువేట ఉత్సవానికి యునెస్కో వారసత్వ గుర్తింపు కోసం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వం కు విన్నవించారు.ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా, ఆళ్ళగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం, నల్లమల కొండలలోని అహోబిలం ఆలయంఉందని, శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి అంకితం చేయబడిన అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి అహోబిలం అని, నరసింహస్వామి తన ఉగ్రరూపంతో అవతరించిన ప్రదేశంగా అహోబిలంను పూజిస్తారని, ప్రహ్లాదుడిని రక్షించి, చెడును సంహరించ దానికి. నవ నరసింహ అని పిలువబడే నరసింహుని తొమ్మిది రూపాలతో కూడిన ఈ అహోబిలం ఆలయం భక్తి, ధైర్యం, దైవ కృపకు ప్రతీకగా నిలుస్తుందని, అహోబిలంలోని అటవీ సమీప ప్రాంతంలో ఉన్న 33 గ్రామాలలో 40 రోజుల పాటు 'పారువేట ఉత్సవం' అనే ఒక ప్రత్యేకమైన పండుగను జరుపుకుంటారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆరు శతాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఈ పారువేట ఉత్సవ పండుగ, విశ్వాసం, భక్తి, సామాజిక, మత సామరస్యానికి ఒక విశిష్ట ఉదాహరణ అని, భక్తులను ఆశీర్వదించడానికి మహా అవతార్ నరసింహ విగ్రహాన్ని ప్రతి వీధికి, ప్రతి ఇంటికి ఊరేగిస్తారని, చెంచు గిరిజన సమాజానికి ఆ దేవుడితో ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక అనుబంధం ఉందని. ఎందుకంటే, రాక్షస రాజు హిరణ్యకశిపుడిని సంహరించి, ప్రహ్లాదుడిని రక్షించిన తరువాత, ఆ దేవుడు చెంచు లక్ష్మిని వివాహం చేసుకున్నాడని నమ్ముతారన్నారు.మహా అవతార్ నరసింహ కథ గొప్ప భక్తితో నిండిన కథ. ప్రతి తల్లి తన బిడ్డ పరమేశ్వరుని పట్ల భక్తిగల భక్త ప్రహ్లాదునిలా ఉండాలని కోరుకుంటుందని,పారువేట ఉత్సవం దాని విశిష్టత కారణంగా ఒక సజీవ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని. ఆరు శతాబ్దాలకు పైగా వారసత్వంగా వస్తున్న ఈ జ్ఞానం, నైపుణ్యం యునెస్కో వారి మానవజాతి అమూర్త సాంస్కృతిక వారసత్వంగా గుర్తింపు పొందడానికి అర్హమైనదని, ఇది మౌఖిక సంప్రదాయాలను, ఆలయ ఆచారాలను, సామూహిక భాగస్వామ్యాన్ని తరతరాలుగా విశ్వాసం సంక్రమించడాన్ని పరిరక్షిస్తుందని. అడ్డంకులను తొలగించి, సామూహిక గుర్తింపును బలోపేతం చేయడం ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహిస్తుందని. శతాబ్దాల నాటి ఈ ఆచారం సమాజానికి భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందని. దీనిని ప్రపంచ స్థాయిలో గుర్తించడం ద్వారా ఈ ప్రాచీన సంప్రదాయాన్ని పరిరక్షించడమే కాకుండా, శాంతి, భక్తి, ఐక్యతను ప్రేరేపిస్తూనే ఉన్న భారతదేశపు సజీవ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కూడా మనం గౌరవించినట్లు అవుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభ దృష్టికి తెచ్చారు.అహోబిలం పారువేట ఉత్సవానికి యునెస్కో సాంస్కృతిక వారసత్వ హోదాను సిఫార్సు చేయాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో విన్నవించారు.

## 'అమరావతికి చట్టబద్ధత ప్రజా సంకల్పానికి విజయం'

**మొదటి నుంచీ విషం కక్కుతున్న జగన్...**
**రైతులపై దాడులు, కేసులు, వేధింపులు**
**అయినా వెనక్కి తగ్గని రైతుల దీక్ష**
**మహిళల అపూర్వ పోరాటానికి ప్రజల మద్దతు**
**న్యాయవ్యవస్థతో నిలిచిన అమరావతి**
**చట్టబద్ధతతో అభివృద్ధికి కొత్త దిశ**
**– రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె.);ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం పట్ల రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి సంతోషం వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విజయం కాకుండా ప్రజల దీర్ఘకాల పోరాటానికి వచ్చిన న్యాయం అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, మద్దతు తెలిపిన పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి రాష్ట్ర ప్రజల కలల నగరమని, దీన్ని శాశ్వత రాజధానిగా నిలబెట్టేందుకు పార్లమెంట్ ఇచ్చిన ఆమోదం చారిత్రాత్మకమని అన్నారు. ఒకే రాజధాని ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అమరావతి బలమైన కేంద్రంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ విధానాలు అమరావతి అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీశాయని, మూడు రాజధానుల ప్రతిపాదనతో ప్రజల్లో అయోమయం సృష్టించారని విమర్శించారు. ఐదేళ్లపాటు అమరావతిని నిర్లక్ష్యం చేసి, రైతుల విశ్వాసాన్ని దెబ్బతీశారని వెంకట రమణ చౌదరి అన్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి నిర్మించిన అమరావతి ఒక ప్రజా ఉద్యమ ఫలితమని, వారి త్యాగాలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు. భూమి అంటే రైతులకు జీవనాధారం అయినప్పటికీ, రాష్ట్ర భవిష్యత్తు కోసం వారు చూపిన నమ్మకం అసామాన్యమని అన్నారు.మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు, మహిళలు చేసిన పోరాటం అపూర్వమని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా పోరాడిన రైతుల సంకల్పం చివరకు విజయం సాధించిందని చెప్పారు. ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి అభివృద్ధి మళ్లీ వేగం పుంజుకుందని, మౌలిక వసతులు, రహదారులు, భవనాలు, విద్యాసంస్థలు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. కేంద్రం సహకారంతో భారీ స్థాయిలో నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.అమరావతి అభివృద్ధితో పెట్టుబడులు ఆకర్షితమవుతాయని, పరిశ్రమలు, ఐటీ సంస్థలు స్థాపనకు మార్గం సుగమమవుతుందని, యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసం, రైతుల త్యాగం, ప్రభుత్వ సంకల్పంతో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతామని, ఇది ప్రతి ఆంధ్రుడి గర్వకారణంగా నిలుస్తుందని బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు.






## శనగ కొనుగోళ్ల పెంపుపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ

**-కొనుగోలు లక్ష్యం పెంచాలని కేంద్రానికి సీఎం లేఖ**



అమరావతి, ఏప్రిల్ 2 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రాష్ట్రంలో శనగ ఉత్పత్తి భారీగా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన కొనుగోలు పరిమితి సరిపోదని గుర్తించిన మంత్రి, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అచ్చెన్నాయుడు సూచనల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 72 వేల మెట్రిక్ టన్నులు, నాఫెడ్ ద్వారా 12 వేల మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు చేశారు. మొత్తం 84 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తవడంతో ప్రస్తుతం ఉన్న లక్ష్యం త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర వ్యవసాయ శాఖ తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది శనగ సాగు విస్తీర్ణం 3,88,413 హెక్టార్లకు పెరిగింది. ఉత్పత్తి కూడా 4,57,365 మెట్రిక్ టన్నులకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి 94,500 మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు లక్ష్యం మాత్రమే ఉన్నప్పటికీ, పెరిగిన ఉత్పత్తి దృష్ట్యా దానిని 4,57,365 మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం మార్కెట్లో శనగ ధర కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులు తమ మొత్తం ఉత్పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు అదనపు కొనుగోళ్లు తప్పనిసరి అని మంత్రి అచ్చెన్నాయుడు భావించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, పెరిగిన ఉత్పత్తికి అనుగుణంగా శనగ కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

## ఏపీ రాజధాని అమరావతి బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందడంపై గుడివాడలో కూటమి శ్రేణుల సంబరాలు




గుడివాడ, ఏప్రిల్ 2,( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్, రాజ్యసభ ఏకగ్రీవంగా ఉభయసభలు ఆమోదించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గుడివాడ కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయం నుండి నెహ్రూ చౌక్ సెంటర్ వరకు జై అమరావతి అంటూ నినాదాలు చేస్తూ కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ చౌక్ సెంటర్లో టపాసులు పేలుస్తూ నినాదాలు చేసిన నాయకులు ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రైతుల త్యాగాలకు న్యాయండ నేడు ఓ చారిత్రాత్మక రోజు అన్నారు.12 ఏళ్లుగా రాజధానిపై అస్పష్టత అభివృద్ధి, పెట్టుబడులు తీవ్రంగా దెబ్బతిన్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పాపం వైకాపాదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధాని దిశగా అడుగులు వేస్తుందని,ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పంతో వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది ఏర్పడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, దింట్యాల రాంబాబు, దానేటి సన్యాసిరావు, వాసే మురళి, చేకూరు జగన్ మోహన్ రావు,అరికెపూడి రామశాస్త్రి,గోర్జి సత్యనారాయణ,మజ్జి శ్రీనివాసరావు,గోకవరపు సునీల్, మజ్జడ నాగరాజు, ఈడే మోహన్, నాగేశ్వరరావు, సాంబశివరావు, వంగపండు ఆదినారాయణ, మెరుగుమాల బ్రహ్మయ్య, రామ దీని వేణు, రబ్బాని, జబీన్, కరీముల్లా, డేవిడ్, అందుగుల యేసుపాదం, సాల్మన్ రాజ్,పాదం, కొల్లారెడ్డి బాబి, అంజిరెడ్డి, జోజి, సాయన రాజేష్, వేమూరి త్రినాధ్,బాంబే శీను, వసంతవాడ దుర్గారావు నిమ్మగడ్డ సత్యసాయి, పంచకర్ల మహేష్, లోయ విజయ్, నిమ్మగడ్డ అరవింద్, నిరంజన్, సాగర్,జానీ షరీఫ్, సర్కార్, అడుసుమిల్లి శ్రీనివాస్, కనకాల నాగేశ్వరావు, చుక్క వెంకటేశ్వరావు, బాలసాని భవాని,దేవేంద్రుడు, కుందేటి ప్రసాద్, ఇమ్మానియేల్, నేరుసు కాశి, కటికల కళ్యాణ్, డొక్కుమాల శ్రీకాంత్, సూరగని సూరిబాబు,దొండపాటి మహేష్, మాదాసు ప్రసాద్, కాసాని శ్రీరామ్,ఇబ్రహీం, మోజెష్,గోరిపత్తి సుబ్బారావు, దేవరపల్లి కోటి,తులసి రాణి, మల్లికా బేగం, కొల్లు రమ్య, దివ్య చౌదరి,సునీత, బుద్ర శాంతి, రమాదేవి, గూడపాటి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారాజధానిగా అమరావతి

**-అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
**-రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టం**
**-1600 రోజుల పోరాటండ రైతులు, మహిళల దీక్షకు గౌరవం**



అమరావతి, ఏప్రిల్ 2( అజయ్ నారగాని - నేటి శుభోదయ) అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజారాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు. 1600 రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు, మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ, ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు. గత 12 ఏళ్లుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతికి మద్దతు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఇది ఐదుకోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, రైతుల త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. రాజధానిపై ఎమ్మెల్యే జగన్ వక్రబుద్ధి ఎప్పటికీ మారదని, రాష్ట్రానికి న్యాయం చేస్తారనే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శిస్తూ, 'మావిగన్' వంటి ప్రతిపాదనలు ఆయన చంచల వైఖరికి నిదర్శనమని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం గత ప్రభుత్వ వైఫల్యాలకు గట్టి సమాధానంగా నిలిచిందని పేర్కొన్నారు. అమరావతి గ్రామాలైన తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి తదితర ప్రాంతాల్లో రైతులు, మహిళలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకోవడం ప్రజల ఆనందానికి నిదర్శనమని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి సువర్ణ భవిష్యత్ అందిస్తుందని, అమరావతి నిత్యశాశ్వత రాజధానిగా నిలుస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

## అంబరాన్ని అంటిన సంబరాలు

**అమరావతికి గ్రీన్ సిగ్నల్!... రేఖపల్లిలోరంగవల్లులతో సంబరాలు!...**



వి.ఆర్.పురం,ఏప్రిల్ 2 (నేటి శుభోదయ ప్రతినిధి)ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంట్ ఉభయసభలు ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో!వరరామచంద్రాపురం, రేఖపల్లి హెడ్ క్వాటర్ లో డ్వాక్రా మహిళలు సంబరాలు ఘనంగా నిర్వహించారు.వసుంధర గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు పలువురినిఆకర్షించాయి.ఈసందర్భంగా బుక్ కీపర్,అనిత,మాట్లాడుతూ, రాష్ట్రానికి రాజధాని అమరావతే అనిమరోసారి దేశంముందుకు రావడం,స్పష్టమైందని హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంయావత్తు అమరావతికి జైకొడుతోందని అన్నారు.ఈనిర్ణయ ద్వారా ప్రతీ ఒక్కరికీ న్యాయం జరిగిందని,స్పష్టంచేశారు.ఇది తెలుగుజాతి గౌరవాన్ని నిలబెట్టిన చారిత్రాత్మక రోజుని పేర్కొన్నారు.సంబరాల్లో భాగంగా ప్రతీ గడపలో కోవత్తులు వెలిగించి హర్షంవ్యక్తంచేస్తున్నారని వివరించారు.అనంతరం అంబేద్కర్,ఎన్టీఆర్,విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.అమరావతి కోసం,వేలాదిమందిరైతులు వేల ఎకరాలభూమిని స్వచ్ఛందంగా ఇచ్చారని,వారిత్యాగం ఎన్నటికీ మరువలేనిదని తెలిపారు. దీర్ఘకాలంగా సాగినరైతుల ఉద్యమానికి సెల్యూట్ తెలుపుతూ,గతంలో జరిగిన ఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని వ్యాఖ్యానించారు.మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్ర అభివృద్ధి దెబ్బతిన్నదని, రాజధానిపైఅనిశ్చితి కారణంగా పెట్టుబడులుతగ్గాయని తెలిపారు. ప్రస్తుతంముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,దూరదృష్టితో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేసేదిశగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.ఈ బిల్లుకు మద్దతు తెలిపిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ,రాష్ట్రప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.వెలుగు కార్యాలయ సిబ్బంది. డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా!

**గతంలోఇక్కడ ప్రభుత్వ వైద్యుడి విధులు!..**

**అద్భుత నిర్ణయానికి పలువురి ప్రశంసలు!..**


**కొత్తూరు గ్రామంలో మానవత్వం చాటిన సేవాభావం!..**

**డాక్టర్. సుందర్ ప్రసాద్!..**




వి.ఆర్.పురం,ఏప్రిల్ (నేటి శుభోదయ ప్రతినిది)మండలంలొ శ్రీరామగిరి పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఒకహృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కెచ్చేల భీమారెడ్డి, కుమార్తె అపర్ణ,ఆడుకుంటూ కింద పడటంతో నడుమువిరగడంతో దాతలుకోసం ఎదురుచూస్తూన్నా విషయం తెలుసుకొని ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవని మరోసారి నిరూపించారు. ఒకప్పటి స్థానిక ప్రభుత్వ వైద్యుడుగా పనిచేసిన డాక్టర్ సుందర్ ప్రసాద్,మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కెచ్చేల బీమారెడ్డి,కుమార్తె ఇటీవల ప్రమాదానికి గురైనవిషయం తెలిసిందే.ఈ ఘటనగ్రామంలో విషాదాన్ని నింపింది. ఈవార్తను పత్రికల ద్వారా తెలుసుకున్న డాక్టర్,సుందర ప్రసాద్,వెంటనే స్పందించి తనమానవత్వాన్ని చాటుకున్నారు.గతంలోరేఖపల్లి వైద్యులుగా(మెడికల్ ఆఫీసర్ గా) ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించారు. ఆయనకు, స్థానికప్రజలతో ఉన్నఅనుబంధం ఇంకాచెదరలేదు.ఈనేపథ్యంలో బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని భావించిన ఆయన, తన మిత్రుల సహకారంతో రూ.5,000/-రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సహాయం తక్షణ వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందని భావించి, ఆలస్యం చేయకుండా పంపించిన ఆయన చర్యను గ్రామస్థులు ప్రశంసిస్తున్నారు.ప్రస్తుతం ఇక్కడ పనిచేయకపోయినా,పాత అనుబంధాన్ని గుర్తుంచుకుని స్పందించిన ఆయన ఉదారతకు అందరూహర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదంగురించి కొన్నిపత్రికల్లో వచ్చినకథనం ద్వారాతెలుసుకున్న ఆయన, వెంటనేచర్యలు తీసుకుని తన మిత్రబృందంద్వారా సొమ్మును బాధితకుటుంబానికి చేరవేశారు.ఈ సందర్భంగా కెచ్చేల బీమారెడ్డి,కుటుంబ సభ్యులు వైద్యుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో అండగా నిలిచిన ఆయన సేవా భావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామపెద్దలు అభిప్రాయపడ్డారు.గతంలో ఇక్కడ ఎంతోమందికి అండగా నిలిచిన విషయం విదితమే!..

## వైభవంగా శివాలయ ప్రతిష్ఠ మహోత్సవం



నేటి శుభోదయ 02 పల్నాడు జిల్లా కారంపూడి :కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో గురువారం శివాలయంలో ప్రతిష్ఠాపన వేడుకను కనులపండువగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి, గర్భాలయంలో శివలింగాన్ని శాస్త్రోక్తంగా కొలువుదీర్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో స్వామివారి సేవలో పాల్గొని.. ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక ఘట్టాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసి, భారీగా అన్నదానం నిర్వహించరు. శివనామస్మరణతో ఒప్పిచర్ల పురవీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాలుగోన్నారు.






## అమరావతిని రాజధానిగా చట్టభద్దత చేయడం పట్ల రుద్రపాకలో ఆనందోత్సవాలు




నందివాడ, ఏప్రిల్ 2 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) అమరావతిని రాజధానిగా పార్లమెంట్ లో చట్టభద్దత చేయడం పట్ల రుద్రపాక జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆనందోత్సవాలు వెలిబుచ్చారు.అమరావతిని రాజధానిగా ప్రధాన మంత్రి మోడీలోకసభ, రాజ్యసభల్లో చట్టభద్దత చేయడంతో నందివాడ మండలం రుద్రపాక లోని పిన్నమనేని వీరయ్య చౌదరి స్మారక జిల్లాపరిషత్ హైస్కూల్ లో విద్యాశాఖ అధికారి పిలుపు మేరకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంపిణి చేశారు. భారతదేశంలోని 29 రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని అమరావతి ని రాజధానిగా చట్టభద్దత చేయడం పట్ల ఆనందోత్సవాలు వ్యక్తం చేసారు.



## జడ్పీ అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు సిద్ధం విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం



నేటి శుభోదయ 02పల్నాడు జిల్లా కారంపూడి : పట్టణంలోని విద్యుత్ శాఖ పని తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా వీధిలో కొనసాగుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను హఠాత్తుగా జడ్పీ స్థలంలో ఏర్పాటు చేయడానికి విద్యుత్తు అధికారులు తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది.స్థానిక స్థల యజమాని కోరిన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు జడ్పీ అనుమతులు పొందకుండా, ఎలాంటి అధికారిక ప్రక్రియలు పూర్తి చేయకుండా హడావిడిగా పనులు ప్రారంభించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం పిలర్ వేయడం ద్వారా అధికారుల నిర్లక్ష్యం స్పష్టమవుతోందని గ్రామస్థులు మండిపడుతున్నారు.ప్రభుత్వానికి చెందిన జడ్పీ భూమిని వినియోగించాలంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ, విద్యుత్ శాఖ ఈ నిబంధనలను పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి, ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ప్రభుత్వ స్థలాన్ని వినియోగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ అంశంపై స్థానిక ఎంపీడీవోను సంప్రదించగా, తమ వద్ద విద్యుత్ శాఖ ఎటువంటి అనుమతులు తీసుకోలేదని, కనీస సమాచారం కూడా ఇవ్వలేదని స్పష్టం చేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. విద్యుత్ శాఖ, విధి నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఇక ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు విద్యుత్ శాఖకు చెందిన సంప్రదించినప్పటికీ వారు ఫోన్‌కు అందుబాటులో లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. బాధ్యత గల అధికారులు స్పందించకపోవడం దారుణమని ప్రజల ఆరోపిస్తున్నారు జడ్పీ స్థలాన్ని అనుమతి లేకుండా వినియోగించడం చట్టవిరుద్ధమని, వెంటనే ఈ పనులను నిలిపివేసి పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన విద్యుత్ శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలకు కారణమైంది.



# దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించాలి

**జిల్లా కలెక్టర్ కు బహుజన్ సమాజ్ పార్టీ వినతి పత్రం**



కాకినాడ జిల్లా, ఏప్రిల్ 2 నేటి శుభోదయ:కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మాతా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఈరోజు కలెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను కేంద్ర ప్రభుత్వం పరిశీలన చేయాలని ఇక దళితుడు ఏ మతం స్వీకరించిన సమాజం తనను చూసి దృష్టి కోణం మారదు గనుక రాజ్యాంగం ప్రకారం మనిషి ఏ మతమైనా పాటించవచ్చు కనుక గతంలో 1956లో సిక్కు మతం స్వీకరించిన దళితులకు 1990లో బౌద్ధ మతం స్వీకరించినటువంటి దళితులకు ఏ విధంగా రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించారు అదేవిధంగా క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు కూడా ఆ సౌకర్యం వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి అదే విధంగా రాష్ట్ర సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున రివిజన్ పిటిషన్ దాఖలు చేయాలని తమ ద్వారా డిమాండ్ చేస్తున్నాము అలాగే పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడు గ్రామం పెద్దపేటలో వివాదాస్పద ప్రాంతం లో గతంలో అక్కడ గోశీతెలమ్మ పండుగ చేసుకునేవారు గనుక ఆ గ్రామ ఎస్సీ మాల కులాల వారి మనోభావాలు దెబ్బతిన్నాయి అలాగే అక్కడ 30 మంది దళితులపై అక్రమంగా కేసులు బనాయించి వారిపై ఎఫ్ఐఆర్ కట్టి జైలుకు పంపించడం జరిగింది. కనుక వారందరినీ తక్షణం ఆ కేసులను ఎత్తివేయాలని విరుపక్షాలపై కేసులు నమోదు చేసి న్యాయ విచారణ జరిపించాలని ఎవరైతే అక్కడ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే దళితులను నీచాతి నీచంగా వారిపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారో అటువంటి వారిపై తగు చర్యలు తీసుకుని ఉపసభాపతిగా ఉన్న ఆయనను ఆ పదవి నుండి సస్పెండ్ చేయాలని ఈ రాష్ట్రంలో మతకల్లోలకు ఇటువంటి వారు పునుగులుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆ ప్రాంతంలో హిందువులు, క్రైస్తవులు ,ముస్లిం లు, సిక్కులు అందరూ అన్నదమ్ముల వలె ఇప్పటివరకు కలిసిమెలిసి ఉండే వారిని ఇటువంటి వారికి పదవి రావడం వలన లేనిపోని మత విద్వేషాలు రెచ్చగొడుతూ అమాయకులైనటువంటి మా మధ్య మతమనే దానిని తీసుకువచ్చి అన్నదమ్ములుగా ఉండేటువంటి మా మధ్య గొడవలు రేపుతున్నారని ఇటువంటి వారికి గౌరవనీయమైన సభా ఉభాపతి పదవి తగదని బహు బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలాగే కాకినాడ జిల్లాలో ఉన్నటువంటి ప్రతి అసెంబ్లీ కన్వీనర్లు మండల నాయకులు గ్రామ నాయకులు అందరూ ఈరోజు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఇటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కేడర్ అంతా పాల్గొని ఉన్నారు.

# ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి

**-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**పార్లమెంట్లో అమరావతి బిల్లు పాస్ కావడంపై హర్షం**

**-కేంద్రానికి, ప్రధాని మోడీకి, ఎంపీలకు మంత్రి సవిత ధన్యవాదాలు**

**-రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు**

**-సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి పరుగులు**

**-అమరావతికి పార్లమెంట్ ఆమోదంతో పనిచేయని జగన్ మైండ్**

**మావిగన్ అంటూ పిచ్చి ప్రేలాపనలు**

**-ఇక జన్మలో జగన్ కు అధికారం కల్ల : మంత్రి సవిత**

**-పెనుకొండలో మంత్రి సవిత నేతృత్వంలో అంబరాన్నంటిన సంబరాలు**



పెనుకొండ, ఏప్రిల్ 2 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పార్లమెంట్ లో అమరావతి బిల్లు పాస్ కావడంతో, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రపంచం మెచ్చుకోదగిన రాజధాని నిర్మాణం కాబోతోందని, స్వర్ణాంధ్రప్రదేశ్ కు బలమైన పునాదులు పడుతున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వెలిబుచ్చారు. అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోడికి, కేంద్రమంత్రులు అమిత్ షాకు, నిర్మలా సీతారామన్ కు, పార్లమెంట్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అమరావతికి పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, జగన్ మైండ్ పని చేయడం లేదన్నారు. నిన్నటి వరకూ మూడు ముక్కలాట ఆడిన జగన్ నేడు మావిగన్ అంటూ పిచ్చి ప్రేలాపన చేస్తున్నాడని మండిపడ్డారు. పిచ్చోడి చేతికి అధికారం ఇచ్చి ఏం జరిగిందో ప్రజలందరూ గమనించారని, భవిష్యత్తులో జగన్ కు ప్రజలు అధికారం ఇవ్వడం కల్లని అని అన్నారు. రాజ్యసభలో అమరావతి బిల్లుకు ఆమోదం లభించడంతో, మంత్రి సవిత నేతృత్వంలో గురువారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పట్టణ ప్రజలను, కూటమి నాయకులను, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. నేడు నవ్యాంధ్రప్రదేశ్ కు శుభ దినమన్నారు. బుధవారం లోక్ సభలో, నేడు రాజ్యసభలో అమరావతికి బిల్లుకు వైసీపీ మినహా అన్ని పార్టీల ఎంపీలూ ఆమోదం తెలపడం ఆనందకరమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రపంచం మెచ్చదగిన రాజధానిగా అమరావతి ఆవిర్భవించనుందన్నారుఇప్పటికే సైబారాబాద్ ను నిర్మించి హైదరాబాద్ ను ప్రపంచ పటంలో నిలిపిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కూర్చోడానికి సీటు కూడా లేదన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, సీమాంధ్రుల కలలు నెరవేర్చడానికి సీఎం చంద్రబాబునాయుడు అమరావతి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంత్రి సవిత గుర్తు చేశారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి నడుం బిగించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

### రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా, తమ రాష్ట్రానికి రాజధాని ఉండాలన్న తపనతో, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వం మీద ఉన్న నమ్మకంతో అమరావతి ప్రాంత రైతులు ఉచితంగా 33 వేల ఎకరాలు ఇచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో రూపాయి కూడా ఖర్చు చేయకుండా వేల ఎకరాలు సేకరించడం సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు. పిచ్చోడి చేతికి రాయి దొరికినట్లు అందివచ్చిన అధికారంతో జగన్ అమరావతిని, రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారన్నారు. ఆయన అసమర్థ పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. మూడు రాజధానులంటూ అమరావతికి భూములిచ్చిన రైతులపై, వారి మహిళలపై దాడులకు, వేధింపులకు దిగారన్నారు. అమరావతి ప్రాంత రైతుల త్యాగం వృథా కాలేదని, పార్లమెంట్ సాక్షిగా అయిదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధానికి చట్టబద్ధత లభించిందన్నారు.

### జగన్ ఈ జన్మకు అధికారంలోకి రాలేడు


అమరావతిపై జగన్ కుట్ర పన్నారని మంత్రి సవిత మండిపడ్డారు. రాజధానిపై రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. విపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి జై కొట్టిన జగన్, అధికారంలోకి రాగానే మాట మార్చేశారన్నారు. ఏపీలో మూడు రాజధానులంటూ రాష్ట్ర ప్రజలను మనోవేదనకు గురిచేశారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ లో అమరావతి బిల్లుకు ఆమోదం లభించడంతో, జగన్ మైండ్ పనిచేయడం లేదన్నారు. నిన్నటి వరకూ మూడు ముక్కలాట ఆడిన జగన్ ఇప్పుడు మావిగన్ అంటూ పిచ్చి ప్రేలాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ లో అన్ని పార్టీలూ అమరావతికి ఆమోదం తెలిపితే, వైసీపీ మాత్రం బాయ్ కాట్ చేసి విషం కక్కిందన్నారు. పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లు మరోసారి జగన్ కు ప్రజలు అధికారం ఇవ్వడానికి సిద్ధంగా లేరని అన్నారు. ఇక జగన్ భవిష్యత్తులో అధికారంలోకి రావడం కల్లని అని స్పష్టంచేశారు.



### పెనుకొండలో అంబరాన్నంటిన సంబరాలు

అంతకుముందు పార్లమెంట్ ఉభయ సభల్లోనూ అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఆమోదం తెలపడంపై పెనుకొండ పట్టణంలో మంత్రి సవిత నేతృత్వంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లారు. సీఎం చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సర్కిల్ వద్ద అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేశారు. బాణా సంచా కాలుస్తూ ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలతో మంత్రి సవిత నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు తరలొచ్చారు.

# పులిగడ్డ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసా



**-సర్పంచ్ డాక్టర్ దాసరి విజయ్ కుమార్**

అవనిగడ్డ, ఏప్రిల్ 2( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రజల నమ్మకమే పెట్టుబడిగా, అభివృద్ధియే లక్ష్యంగా సాగిన నా ఐదేళ్ల ప్రస్థానం ఎంతో సంతృప్తినిచ్చింద అని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా గురువారం పులిగడ్డ పంచాయతీ కార్యాలయంలో ఆయన తన హయాంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను మీడియా ముఖంగా వివరించారు.2021 ఏప్రిల్ 3న పదవీ బాధ్యతలు చేపట్టిన సమయంలో గ్రామంలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని విజయ్ గుర్తు చేసుకున్నారు. ప్రధానంగా త్రాగునీటి సమస్య, అధ్వాన్నంగా ఉన్న రోడ్లు, వెలగని వీధి దీపాలపై ఎన్నికల ప్రచారంలో ప్రజలు నిలదీశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మొదటి బోర్డు మీటింగ్ లోనే వీటి పరిష్కారానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. ఏడాది కాలంలోనే ఇంటింటికి కుళాయి సౌకర్యం కల్పించడంతో పాటు, నీటి సరఫరా మెరుగుపరచడానికి 9 వాల్ బిట్లు వేయించామన్నారు. రూ. 2.80 కోట్ల వ్యయంతో మొత్తం 59 సిమెంట్ రోడ్లు నిర్మించామని, ఇందులో 44 రోడ్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మించినట్లు వెల్లడించారు. అలాగే గ్రామంలో మూలన పడ్డ వీధి దీపాలను పునరుద్ధరించామని చెప్పారు.కోవిడ్ కష్టకాలంలో చేసిన సేవలు, వరదల సమయంలో పునరావాస కేంద్రాల సక్రమ నిర్వహణ ప్రజల మన్ననలు పొందాయని, అందుకే తనను భారీ మెజారిటీతో గెలిపించారని ఆయన పేర్కొన్నారు. తన గెలుపుకు, ఈ అభివృద్ధికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ప్రస్తుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ల సహకారం మరువలేనిదని, అలాగే పాలకవర్గంలో అండగా నిలిచిన వైస్ ప్రెసిడెంట్ మండలి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ ఈవో బి.అనితలకు ధన్యవాదాలు తెలిపారు.పదవీ కాలం ముగిసినా గ్రామంలో సమస్యల మీద అనునిత్యం పోరాటం చేస్తానని తెలిపారు. నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం, పులిగడ్డ సర్కిల్ వద్ద జిల్లా పరిషత్ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయలేకపోయామన్న చిన్న వెలితి ఉందని విజయ్ అన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ని కలిసి ఈ రెండు పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చిన ఆ దేవుడికి, పులిగడ్డ ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

## అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర ప్రజలందరికీ శుభపరిణామం

**- ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



విజయవాడ, ఏప్రిల్, 2 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ప్రసాదంపాడు గ్రామంలో రూ.3.54 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ శక్తి కల్యాణ మండపం రోడ్డును ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం అమరావతి రాష్ట్ర రాజధానిగా పార్లమెంట్‌లో ఆమోదం పొందిన సందర్భంగా జాతీయ జెండాలు చేతబట్టి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడం రాష్ట్ర ప్రజలందరికీ గొప్ప శుభపరిణామమని, ఇకపై అమరావతిని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ముక్తకంఠంతో ఈ బిల్లును స్వాగతించారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మినహా దేశంలోని అన్ని పార్టీలు మద్దతు పలికాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శిస్తూ, రాబోయే కాలంలో అమరావతి హైదరాబాద్, బెంగళూరు తరహాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజనలో పాత హామీలు అమలు కాక తొమ్మిది గ్రామాల ప్రజలు నిధులు, తాగునీటి సౌకర్యాల్లో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేస్తూ, కరెన్సీ నగర్ వరకు ఉన్న పైప్‌లైన్‌ను ఈ గ్రామాలకు విస్తరించి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారమని తెలిపారు. జలజీవన్ మిషన్ నిధులతో పరిమిత ప్రయోజనం మాత్రమే ఉంటుందని, విలీనంతోనే డ్రైనేజీ, చెత్త సేకరణ సమస్యలు తీరతాయని చెప్పారు.



నున్న ప్రాంతంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండి రోజుకు 4050 వేల మంది ప్రయాణించే మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, సీఆర్‌డీఏ ద్వారా రూ. 3.54 కోట్లు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించామని వివరించారు. గన్నవరం నియోజకవర్గానికి తగిన నిధులు అందడం లేదని, ఈ సమస్యలన్నింటినీ త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం మాత్రమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన అభివృద్ధి అని ఆయన పునరుద్ఘాటించారు.గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ప్రసాదంపాడు గ్రామ సర్పంచ్ సర్నాల గంగారత్నం, ప్రసాదంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు పోలిశెట్టి రమణ, టిడిపి నాయకులు కోనేరు నాగేంద్ర కుమార్, బొప్పన హరికృష్ణ, కోనేరు పెదబాబు, గూడపాటి తులసిమోహన్, పొదిలి లలిత, దాసరి మహేష్, అద్దేపల్లి సాంబు, పట్టపు చంటి, సర్నాల బాలాజీ, బొమ్మసాని దుర్గారావు, కోనేరు సందీప్, మేడేపల్లి రమ, నెక్కంటి శ్రీదేవి, బుస్సే సరిత, బోడపాటి రవి, చల్లగాలి సునీల్, సొంగ సంతోష్, గంపా శ్రీనివాస్, శ్రీవిద్య, దాసరి శ్వేత, కొమ్మినేని బాబీ, పొదిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి చుట్టూ భక్తి ప్రపత్తులతో ‘ చైత్రమాస పౌర్ణమి’ గిరి ప్రదక్షిణ పోటెత్తిన భక్తజనం



విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి చుట్టూ గురువారం చైత్రమాస శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో సాగింది. తెల్లవారుజామున 5:55 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ కార్యనిర్వహణాధికారి (జు.ా.), స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వి.కె. శీనానాయక్ కొబ్బరికాయ కొట్టి ఈ ఆధ్యాత్మిక యాత్రను అధికారికంగా ప్రారంభించారు. పల్లకిపై కొలువుదీరిన అమ్మవారు స్వామివార్ల ఉత్సవ మూర్తుల వెంట భక్తులు కాలినడకన ముందుకు సాగారు. ‘జై దుర్గ.. జై జై దుర్గ’ అనే నినాదాలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మారుమోగాయి. గిరి ప్రదక్షిణ కోసం వైదిక కమిటీ సభ్యులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మార్గమధ్యంలో తగిన సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శివ ప్రసాద్, ఇతర ఆలయ అర్చక బృందం ఉత్సవ విభాగం సూపరింటెండెంట్ సతీష్, ఇతర ఆలయ సిబ్బంది, వేలాది మంది భక్తులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ ప్రదక్షిణ కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమై కుమ్మరిపాలెం, సీతారా జంక్షన్, చిట్టినగర్ మీదుగా సాగి ఘాట్ రోడ్డు అమ్మవారు వద్ద ముగిసింది. మాఘ పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణ చేయడం వల్ల సకల పాపాలు తొలగి, శుభం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## “ వెండిరధం పై ఊరేగిన ఆదిదంపతులు“



విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పై వైభవంగా జరుగుతున్న శ్రీ దుర్గామల్లేశ్వరుల చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా సాయంత్రం 5 గంటలకు -శ్రీ మల్లేశ్వర మహా మండపం నుండి శ్రీ దుర్గా మల్లేశ్వరుల వెండిరథోత్సవం ప్రారంభం అయింది. సంప్రదాయ కళలైన తప్పెట్లు, కోలాట నృత్యములు, తాళం భజన కళాకారుల ప్రదర్శలు ముందు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ దుర్గా మల్లేశ్వరుల వెండి రథోత్సవసేవ కనకదుర్గానగర్, కుమ్మరి పాలెం సెంటర్, కామకోటి నగర్, శంకర మఠం, విద్యాధరపురం, సొరంగమార్గం, కొత్తపేట, బ్రాహ్మణవీధి,రథం సెంటర్ మీదుగా దేవస్థానమునకు చేరుకుంది. వెండిరథంపై కొలువైన ఆది దంపతులు భక్త కోటిని అనుగ్రహించారు. ఆది దంపతులు వేంచేసిన వెండి రథం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లో మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు,కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ),ఆలయ ఈవో వి.కె. శీనానాయక్, ధర్మ కర్తల మండలి సభ్యులు, స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజధాని అమరావతికి చట్టబద్ధత - బిల్లు పార్లమెంటులో ఆమోదం పట్ల ఎంపీ కేశినేని చిన్ని హర్షం

**లోక్ సభ, రాజ్య సభల్లో బిల్లు ఆమోదనికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు: ఎంపీ శివనాథ్**




విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లోనూ బిల్లు ఆమోదం పొందడం పట్ల విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని ) హర్షం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లు ఆమోదం ఐదు కోట్ల మంది ఆంధ్రులలో పట్టలేని ఆనందాన్ని నింపుతుందన్నారు. ఈ మేరకు ఎంపీ కేశినేని చిన్ని గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఆంధ్ర రాష్ట్ర శాశ్వత రాజధానిగా ఇకపై అమరావతి శాశ్వత కీర్తిని పొంద నుందన్నారు. గత ప్రభుత్వం రాజధాని విషయంలో ఆడిన మూడు ముక్కలాట రాష్ట్ర ప్రజల్లో ఆందోళన కలిగించిందన్నారు. తమ రాష్ట్ర రాజధాని ఏదో కూడా చెప్పుకోలేని దుస్థితిలో నాడు రాష్ట్ర ప్రజలు ఉన్నారన్నారు. ఇటువంటి తరుణంలో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి ప్రాంతానికి కంకణ బద్ధులై, రాజధాని అమరావతిని రానున్న కాలంలో సైతం ఎవరు కదపలేని విధంగా శాశ్వత రాజధానిగా చేయడానికి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో అమరావతికి చట్టబద్ధత బిల్లును స్వయంగా తానే ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా బిల్లు ఆమోదం పొందేలా చేశారన్నారు. అసెంబ్లీ నుంచి పార్లమెంటుకు వచ్చిన ఆ బిల్లు నిన్న లోక్ సభ, నేడు రాజ్యసభ లలో ఆమోదం పొందడం, అమరావతి బిల్లు పార్లమెంటులో ఆమోదానికి వచ్చే సమయంలో తాను అమరావతి ప్రాంత విజయవాడ ఎంపీగా ఉండడం సంతోషంగా ఉందన్నారు.పార్లమెంటు ఉభయ సభలలోను అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందేందుకు కృషిచేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ కి ఈ సందర్భంగా తెలుగు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. అమరావతి రాజధాని చట్టబద్ధత కు కృషిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, యువనేత రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈ క్లస్టర్ల జోరు

**47 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్**

**66 వేల మందికి పైగా ఉపాధి:లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు జీతన్ రామ్ మాంఝీ సమాధానం**




విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి దిశగా అడుగులు వేగంగా పడుతున్నట్లు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి జీతన్ రామ్ మాంఝీ తెలిపారు. ఎం ఎస్ ఎం ఈ క్లస్టర్ల అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురోగతిపై గురువారం లోక్ సభ లో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం‘ (ఎం ఎస్ ఈ - సిడిపి ) కింద రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 47 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో వేలాది మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆమోదించిన ప్రాజెక్టులలో 11 ఉమ్మడి సౌకర్యాల కేంద్రాలు (సి ఎఫ్ సి ఎస్ ), 36 మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఐడి) ప్రాజెక్టులు ఉన్నాయన్నారు . ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ప్రాజెక్టుల ద్వారా దాదాపు 66,093 మందికి ఉపాధి లభించిందన్నారు. ఇందులో కేవలం సి ఎఫ్ సి ల ద్వారా 8,300 మందికి, ఐడి(మౌలిక సదుపాయాల అభివృద్ధి) ప్రాజెక్టుల ద్వారా 57,793 మందికి ఉపాధి దక్కినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందని కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీ తెలిపారు. ప్రధాన ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి గతలను పరిశీలిస్తే మచిలీపట్నంలోని ఇమిటేషన్ జ్యువెలరీ, విజయవాడ, జగ్గయ్యపేటలోని గోల్డ్ ఆర్నమెంట్ క్లస్టర్లు, తూర్పుగోదావరి జిల్లా రాయవరంలోని పప్పుధాన్యాల క్లస్టర్, కాకినాడలోని ప్రింటింగ్ క్లస్టర్లు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయన్నారు . రాజమండ్రిలో ఫర్నిచర్, నెల్లూరులో హోజరీ , రెడీమేడ్ దుస్తులు, తిరుపతిలో ప్రింటింగ్, శ్రీకాకుళంలో ఫుడ్ ప్రాసెసింగ్ వంటి 6 క్లస్టర్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విజయవాడ, తడ, నంద్యాల వంటి ప్రాంతాల్లో పాత పారిశ్రామిక ఎస్టేట్ల ఆధునీకరణతో పాటు కొప్పర్తి (కడప), గంగ్రాజుపల్లి (చిత్తూరు) వంటి ప్రాంతాల్లో కొత్త పారిశ్రామిక ఎస్టేట్ల నిర్మాణం పూర్తయినట్లు మంత్రి పేర్కొన్నారు. మహిళలను స్వయం ఉపాధి వైపు మళ్లించేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 90,207 మంది మహిళలకు ప్రాథమిక శిక్షణ అందించడం జరిగిందని వివరించారు. అదేవిధంగా

పీఎంఈజీపీ పథకం ద్వారా రాష్ట్రంలో 1,56,567 మహిళా నేతృత్వంలోని సూక్ష్మ పరిశ్రమలకు చేయూత లభించిందన్నారు. గత ఐదేళ్లలో 28,388 మంది మహిళలు నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ( ఈ ఎస్ డి పి) ద్వారా ప్రయోజనం పొందారన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు వ్యయంలో సాధారణంగా 60 శాతం నుండి 70 శాతం వరకు గ్రాంట్లు అందిస్తోందనీ, మహిళా, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆస్పిరేషనల్ జిల్లాల్లో (విజయనగరం వంటివి) చేపట్టే ప్రాజెక్టులకు గరిష్టంగా 80 శాతం వరకు అంటే రూ. 15 కోట్ల నుండి రూ. 30 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. క్లస్టర్లలోని సమస్యలను పరిష్కరించేందుకు కాలానుగుణంగా మార్గదర్శకాలను సవరిస్తున్నట్లు కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీ స్పష్టం చేశారు.

## రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్ లోక్ సభలో ఆమోదం పొందినందుకు

**- కార్పొరేషన్ లో వేడుకలు**




విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్ లోక్సభలో ఆమోదం పొందినందుకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కు చట్టబద్ధత బిల్ లోక్సభ ఆమోదం పలికినందుకు ఈ వేడుకలు జరుపుకుంటున్నామని, నగరంలోని జోనల్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, వసతి గృహాలులో కూడా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి చంద్రశేఖర్, ఏ రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యు సి డి విజయలక్ష్మి, అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం చారిత్రాత్మక ఘట్టం

**అమరావతి మన రాజధాని ఘన సంబరాలు**



విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- అమరావతి మన గౌరవమని, మన స్వాభిమానానికి ప్రతీకగా నిలుస్తుందని, పార్లమెంటులో ఆమోదం పొందడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని, రాష్ట్ర అభివృద్ధికి నూతన దిశగా మారుతుందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ గురువారం రాజ్యసభలో అమరావతి రి-ఆర్గనైజేషన్ సవరణ బిల్లు ఆమోదం పొందిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వారి కార్యాలయం వద్ద ఘనంగా సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. “జై అమరావతిడ జై జై అమరావతిడ” అంటూ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. అక్కడి నుంచి వారు ఉరేగింపుగా ఆటోలు, బైకులతో ఎన్టీఆర్ సర్కిల్ కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా గద్దె దంపతులు మాట్లాడుతూ అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందడం చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను గౌరవిస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి బిల్లు ఆమోదం ప్రజాస్వామ్యానికి గొప్ప ఉదాహరణగా నిలిచిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి బిల్లుకు మద్దతు పొందడం కూటమి నాయకత్వ విజయమని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేంద్ర ప్రభుత్వం చూపిన నిబద్ధత అభినందనీయం అన్నారు.అమరావతికి ఇకపై ఎటువంటి చట్టపరమైన అడ్డంకులు ఉండబోవని, ఈ బిల్లు ద్వారా అభివృద్ధికి స్పష్టమైన రోడ్-మ్యాప్ సిద్ధమైందని గద్దె దంపతులు తెలిపారు. అమరావతి ఇప్పుడు నిజంగా ఊపిరి పీల్చుకుందని, అభివృద్ధి పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక బిల్లు ఆమోదం మాత్రమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ గౌరవం గెలిచిన రోజు అని వారు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం కోసం కూటమి ఎంపీలు చిత్తశుద్ధితో చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, అబ్దుల్ కరీమ్, మేదరమెట్ల నారాయణ, మాదల రాజ్యలక్ష్మి, సాయిన బుజ్జి, వీరమాచినేని రంగారావు, బెజవాడ నజీర్, ఎం.వీరారెడ్డి, గోగుల ఏసుబాబు, షేక్ మస్తాన్, షేక్ బాజి, బాలు, కోడె సాంబశివరావు, అనేక మంది కార్యకర్తలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయండి

**: వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్, సుందరయ్య కట్ట, కండ్రిక జంక్షన్, వేముల శ్యామలాదేవి రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సుందరయ్య కట్ట వద్ద పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసివేయాలని అధికారులను ఆదేశించారు. కండ్రిక జంక్షన్ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ కావాల్సిన మౌలిక వస్తువులన్నీ కల్పించాలని, మరమ్మతులన్నీ త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్రోడ్ వద్ద జంక్షన్లో హరితాన్ని పెంచాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ ని ఆదేశించారు.ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి , అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 2 నుండి ఈ నెల 5 వరకు ఆస్తి పన్నుకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

**వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**




విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను డిమాండ్ జనరేషన్ ప్రక్రియలో భాగంగా సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నందున, గురువారం నుండి ఈ నెల 5 వరకు ఆస్తి పన్నుకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడినట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. కావున ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని, మరళా ఆస్తిపన్నుకు సంబంధించి ఈ నెల 6 నుండి కొత్త డిమాండ్ కు పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించవలసిందిగా కోరారు. ప్రజలు డ్రైనేజీ, వాటర్ మీటర్ పన్ను బకాయిలు చెల్లించేందుకు ఎటువంటి అంతరాయం ఉండదని అవి యధావిధిగా వీఎంసి సమస్త వారి క్యాష్ కౌంటర్లు గాని శీబతీజఎఎ.శీతీస్త్ర వెబ్ సైట్ ద్వారా గాని చెల్లించవచ్చని తెలిపారు.

## సర్పంచ్ గా గ్రామాభివృద్ధి కి అవకాశం రావడం అదృష్టం



నేటి శుభోదయ - వెలుగోడు : నంద్యాల జిల్లా ప్రతినిధి (నాగేంద్ర ):సర్పంచ్ గా వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కి అవకాశం రావడం అదృష్టమని సర్పంచ్ జైపాల్ పేర్కొన్నారు. వెలుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గురువారం సర్పంచ్ పదవి కాలం 5 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా వీడ్కోలు సమావేశం కార్యనిర్వహణ అధికారి మల్లి నరేంద్ర అధ్యక్షతన ఘనంగా జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఏ సర్పంచ్ చేయని విదంగా పాత బస్టాండ్ వద్ద గల పంచాయతీ స్థలం లో రూములు నిర్మించి, పంచాయతీ కి సంపద సృష్టించిన ఘనత జైపాల్ కే దక్కుతుందని అన్నారు. జమ్మినగర్ లో జమ్మిచెట్టు చుట్టూ అరుగు, సిమెంట్ రోడ్డు నిర్మాణం ,కరోనా సమయం లో సిబ్బంది చేత చేయించిన సేవలు , కార్మికుల కు వేతనం 3వేలు పెంచడం సర్పంచ్ అందరి ప్రశంసలు పొందారని అన్నారు. పట్టణం లోని 20వార్డ్ మెంబర్ల దంపతులకు సర్పంచ్, ఇ. ఓ, సిబ్బంది ఘనంగా సన్మానించి , చీరలు పంపిణి చేశారు. సర్పంచ్ దంపతులకు గ్రామ పంచాయతీ సిబ్బంది , వైఎస్ఆర్సిపి నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు , మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్ రెడ్డి , విఆర్ కె ఆర్ ఆర్ సంస్థ అధినేత రాఘవరెడ్డి , మాజీ ఎంపిపి ఎల్లాల కృష్ణుడు, యూటి ఎఫ్ రామకృష్ణ, దివ్యంగుల అధ్యక్షులు రంగస్వామి లు ఘజమాల, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఆతర్వాత సర్పంచ్ దంపతులను గ్రామ పంచాయతీ నుండి పట్టణం తప్పేట్లతో, బాణా సంచాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటి వద్ద విడిచారు. ఈ కార్యక్రమం ల ఎంపిపి లాలం రమేష్,మాజీ సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి ,అంబాల ప్రభాకర్ రెడ్డి , రామ్మోహన్ రెడ్డి, నసరుల్లాఖాన్, చికెన్ బాషా, వెంకట్రామిరెడ్డి , గోవిందు, మండ్ల శంకరరెడ్డి, వైస్ ఎంపిపి శంకర్ నాయక్, బేగ్, షశీషిర్ , ఇలియాస్, అమీర్ హంజ,

## పచ్చిరొట్ట ఎరువుగా చాలా ప్రయోజనకరం

నేటి శుభోదయ - వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి (నాగేంద్ర ):విత్తనం కు ముందు పొలంలో పచ్చిరొట్టె వేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వ్యవసాయ అధికారిణి స్వాతి తెలిపారు.పిఎండిఎస్ కిట్టు లో అన్ని రకాల విత్తనాలు కలిగి ఉండడం వల్ల పచ్చి రొట్టె ఎరువులు అయినా జీలుగల కంటే ఎక్కువ ఎఫెక్టివ్ గా చీలిగల కంటే ఎక్కువ లాభ దాయకంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నిరూపించబడింది. కాబట్టి రైతులందరూ గమనించి పైన సూచించిన అన్ని రకాల విత్తనాలు కలిగిన పిఎండిఎస్ కిట్లను ఈసారి పచ్చిరొట్ట పైరుగా పెంచవలసిందిగా కోరారు.

## వేల్పనూరు నిప్పులవాగు లో గుర్తు తెలియని శవం

నేటి శుభోదయ - వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి (నాగేంద్ర ):మండలం లోని వేల్పనూరు వద్ద గల నిప్పులవాగు లో గురువారం గుర్తు తెలియని శవాన్ని పోలీసులు గుర్తించారు. ఉదయము 9:00 గంటల సమయంలో వేల్పనూరు గ్రామము ఊరు బైట జమ్ములమ్మ గుడి దగ్గరిలో గల నిప్పులవాగు పై గల ఖవీ పొవర్ ప్లాంట్ గేట్ల దగ్గర నీటిలో సుమారు 40-50 సం.లు మధ్య వయసు కలిగిన ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవము బోర్లా పడి నీటిపై తెలియాడుచు వుండగా, వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్. ఐ సురేష్ తెలిపారు. శవము పై వీ ఏం టెక్స్ట్ అను పేరు గల నీలం రంగు ఫుల్ డ్రాయర్ ఉందని , శవమును గుర్తు పట్టుటకు ఎలాంటి ఆనవాళ్ళు మరియు గాయములు కానీ ఏమి లేవని అన్నారు. సదరు గుర్తు తెలియని శవం గురించి ఎవరికైనా ఏదైనా సమాచారం తెలిసిన యెడల వెలుగోడు పోలీస్ స్టేషన్ 9121101183 గారికి సమాచారం ఇవ్వగలరని కోరారు.

## అమరావతి రాజధాని సందర్భంగా వెలుగు సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ



గోకవరం -నేటిసుబోదయ. :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని, పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని గోకవరం ఏపీఎం జయంతి రాజు అన్నారు.గురువారం రాత్రి గోకవరం మండలం సమాఖ్య భవనం వద్ద డ్వాక్రా మహిళలుతో కలిసి అమరావతి రాజధాని ప్రకటించిన సందర్భాన్ని ఏపీఎం జయంతిరాజు పంచుకున్నారు.ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ అమరావతి రాజధానికి చట్టబద్ధత కలగడం వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. అనంతరం సిబ్బంది, డ్వాక్రా మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాల నియోజకవర్గ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం

...దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి



ముగియనున్న స్థానిక సంస్థల పదవీకాలం నేటి శుభోదయ - నంద్యాల :ఏప్రిల్ 2నంద్యాల జిల్లా ప్రతినిధి (నాగేంద్ర ):నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక ప్రాధాన్యతను సంతరించుకున్నది. నంద్యాల నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం రేపటితో ముగియనున్న నేపథ్యంలో, నంద్యాల మరియు గోస్పాడు మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు మరియు ఎంపీటీసీలతో ఈరోజు నగరంలోని స్థానిక అన్నపూర్ణ హోటల్ నందు భారీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మరియు మాజీ రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి పాల్గొని ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపీ నాయకత్వంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో పార్టీ అత్యధిక మెజారిటీతో మళ్ళీ అధికారాన్ని చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి,ఎంపీపీలు: శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు: రామసుబ్బారెడ్డి. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు: పురుషోత్తం రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి: శివనాగిరెడ్డి, నంద్యాల మండల అధ్యక్షుడు: బసవేశ్వరరెడ్డి, వైసీపీ నేత: ప్రహ్లాదరెడ్డి మరియు పెద్ద సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




నేటి శుభోదయ నంద్యాల, ఏప్రిల్ 02:నంద్యాల జిల్లా ప్రతినిధి (నాగేంద్ర +)నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగంతో పాటు ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ (ఓపీ), రిజిస్ట్రేషన్ బ్లాక్, మెడికల్ ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని




సంబంధిత వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రత, సమయపాలన, సేవల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేసారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం ప్రతి వైద్యుడి బాధ్యత అని సూచించారు. అలాగే, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలను మరింత మెరుగుపరచాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.డిఐపిఆర్ఓ, నంద్యాల వారి ద్వారా జారీ

## అమరావతి రాజధానిగా చట్టబద్ధత జిల్లావ్యాప్తంగా ప్రజల హర్షాతిరేకాలు

**- బూరుగుపూడిగేటు టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, సంబరాలు జరిపిన తెలుగు తమ్ముళ్లుకోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె.);**



అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ప్రకటించి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించిన నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో గురువారం వివిధ నియోజకవర్గాలు, మండలాల్లో ప్రజలు స్వచ్ఛందంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థిని విద్యార్థులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలక నిర్ణయమని పేర్కొంటూ ప్రజలు ఆనందోత్సాహాలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం బూరుగుపూడి గేట్ వద్ద టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు



ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆదేశాలు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. బాణాసంచా కాల్పులు కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బూరుగుపూడి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బాబా వారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాలలో స్వచ్ఛందంగా ప్రజలు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ప్రజల భాగస్వామ్యంతో జరిగిన ఈ సంబరాలు అమరావతి రాజధాని నిర్ణయానికి లభించిన ప్రజా మద్దతును ప్రతిబింబించాయి.

## గాడాలలో పలు కుటుంబాలను పరామర్శించిన జనసేన నా సేన కోసం

**నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మీ....**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం గాడాల గ్రామంలో రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ జనసేన కోసం నా వంతు కమిటీ కోఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పలు కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు మనో ధైర్యాన్ని చెప్పి అన్ని విధాలా కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. అరుబోలు శివ తండ్రి ఇటీవల కాలం చేశారు. బోయిడి చల్లారావు ఇటీవల కాలం చేశారు. యాసాల రాజు తండ్రి ఇటీవల కాలం చేశారు. వారి కుటుంబాలను శ్రీమతి వెంకటలక్ష్మి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధతతో రాష్ట్రానికి స్థిరత్వం, సుస్థిరత

**భావితరాల అభివృద్ధికి కేంద్రంగా అమరావతి: ఎమ్మెల్యే కృష్ణప్రసాదు**



విజయవాడ, ఏప్రిల్ 2 (నేటి శుభోదయ):- ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్థిరత్వం, సుస్థిరత ఉంటుందని, రాజధాని సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమరావతిని అభివృద్ధి చేసి ఏపీని ప్రధాన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పేర్కొన్నారు. అమరావతి రాజధానిగా పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ శుభ సందర్భంగా విజయవాడ రూరల్ గొల్లపూడిలో కూటమి కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం కాగడాలు చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో అతి తక్కువ కాలంలోనే పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రజల ఉక్కు సంకల్పం, అమరావతి రైతుల త్యాగఫలం, సీఎం చంద్రబాబు కృషి పట్టుదల, కూటమి ప్రభుత్వం కృషితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కలలు సాకారం అవుతున్నాయని అన్నారు. ప్రధాని మోడీ కు, సీఎం చంద్రబాబు కు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

**వింత పేర్లతో విషం కక్కుతున్న జగన్మోహన్ రెడ్డి.**

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ఉమ్మడి ఏపీని సాధించి హైదరాబాదును రాజధానిగా అభివృద్ధి చేసుకుంటే, 2014లో మళ్ళీ మరోసారి విడిపోయి నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశారన్నారు. మళ్ళీ రాజధానిగా దార్శనికుడు సీఎం చంద్రబాబు సారథ్యంలో అమరావతిని అభివృద్ధి చేసుకుంటే, 2019లో ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాజధానిపై కుట్రలు చేశాడన్నారు.అమరావతి మనందరికీ ఒక సెంటిమెంట్ అని, 201924 మధ్య కాలంలో ఏపీ రాజధాని తీవ్ర అనిశ్చితిని చవిచూసిందన్నారు. గత వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అనాలోచిత నిర్ణయం తీసుకుంది. దీన్ని అప్పట్లో జగన్ ఇంట్లోనే తను తొలి సమావేశంలోనే వ్యతిరేకించానన్నారు. అమరావతిని రాజధానిగా అంగీకరిస్తున్నానని ప్రతిపక్ష హోదాలో చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల వ్యవహారాన్ని తెర పైకి తెచ్చారు. అమరావతి పట్ల జగన్ మోహన్ రెడ్డి వైఖరి ఎప్పటికీ మారదని నిన్నటి మీడియా సమావేశంతో మరోసారి స్పష్టమైందన్నారు. అమరావతి రాజధాని బిల్లును కూడా వైసీపీ వ్యతిరేకించిందన్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులను దీనిపై ప్రజలు ప్రశ్నించాలన్నారు. విశాఖపట్నం, కర్నూలుకు పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చాయని అన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి నిరోధకుడు జగన్మోహన్ రెడ్డిని శాశ్వతంగా అధికారంలోకి రాకుండా చేయాలని పిలుపునిచ్చారు.భావితరాల అభివృద్ధికి కేంద్రం అమరావతి.ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజధానిది కీలకపాత్ర. ఇప్పుడు నిర్మించే అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తుంది. 75 ఏళ్ల వయసులో 25 ఏళ్ల నవయువకునిగా శ్రమిస్తూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పునఃనిర్మిస్తున్నాడని అన్నారు. అమరావతిలో రూ.56వేల కోట్లతో అత్యంత ముఖ్యమైన 91 మౌలిక ప్రాజెక్టుల నిర్మాణం సాగుతోందన్నారు. కేంద్రం హడ్కో ద్వారా రూ.11వేల కోట్ల రుణం అందించిందన్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీ, కేంద్రం కలిపి రూ.15వేల కోట్ల సాయం చేస్తున్నాయన్నారు. క్వాంటమ్ వ్యాలీతో అమరావతి కొత్త చరిత్రకు నాంది పలుకుతుందన్నారు. అమరావతి రాజధానితో ఎన్నో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందన్నారు. భావితరాల అభివృద్ధికి కేంద్రంగా అమరావతి మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), బీజేపీ మైలవరం నియోజకవర్గ ఇంచార్జి నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల), తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పుకు పార్లమెంటు పట్టాభిషేకం

**అమరావతికి దక్కిన రాజ్యాంగ రక్షణ నంద్యాల గడ్డపై వెల్లివిరుస్తున్న విజయ గీతిక - మన రాజధాని, మన అమరావతి**




నేటి శుభోదయ - నంద్యాల నంద్యాల జిల్లా ప్రతినిధి ( నాగేంద్ర ):నంద్యాల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే చారిత్రాత్మక నిర్ణయం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయంలో ఈ రోజు సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పద్మావతి ఆర్చి వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నా రాజధాని అమరావతి అనే నినాదాలు పలికారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాజధాని కోసం ఎదురుచూస్తూ, పోరాటం చేస్తూ వచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా విభజించే ప్రయత్నం చేసి, ఆంధ్రప్రదేశ్‌కు స్థిరమైన రాజధాని లేకుండా చేసిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి, మంత్రి నారా లోకేష్ గారి సంకల్పంతో అమరావతిని తిరిగి ఒకే రాజధానిగా నిలబెట్టడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అమరావతి రైతులు, మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, మంత్రి నారా లోకేష్ గారు గారు చూపిన పట్టుదల, పోరాట స్ఫూర్తి ఈ విజయానికి ప్రధాన కారణమని మంత్రి ఫరూక్ తెలిపారు. శాంతియుతంగా పోరాడిన రైతుల త్యాగాలకు ఇది దక్కిన న్యాయం అని అన్నారు. ఇవాళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ పండుగ రోజు అని, ఇకపై రాబోయే తరతరాలకు అమరావతి అభివృద్ధి మరియు సంక్షేమానికి రెండు కళ్ళుగా నిలుస్తుందని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే బ్రాండ్‌గా అమరావతి రూపుదిద్దుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఆనందాన్ని ప్రజలతో కలిసి పండుగలా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారి మద్దతుతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, మంత్రి నారా లోకేష్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకుల అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# బోల్లెద్దూపాలెం గొలుగులమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో పాల్గొన్న 'కంబాల'

**జాతర ఉత్సవాలకు 50 వేలు రూపాయలు విరాళం..**
**- జాతరలో పని చేసిన కోలాటం బృందం, బ్యాండ్ మేళం సభ్యులు ,**
**లైటింగ్, ఎలక్ట్రిషన్, పలు కళాకారులకు అందరికి కలిపి 50 వేలు రూపాయలు నగదు బహుమానం..**

కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం బోల్లేదుపాలెం గ్రామంలోని శ్రీ గొలుగులమ్మ అమ్మవారి జాతర





మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు బుధవారం రాత్రి పాల్గొన్నారు.తొలుత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు హారతులు పట్టి పూలమాలలతో ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కోలాటం బృందంతో కలిసి కోలాటం ఆడారు. జాతర మహోత్సవాలకు 50 వేలు రూపాయలు విరాళం అందించారు. అలాగే జాతర ఉత్సవాల్లో పని చేసిన కోలాటం బృందం, బ్యాండ్ మేళం సభ్యులు, లైటింగ్, ఎలక్ట్రిషన్ పలు కళాకారులు అందరికి కలిపి 50 వేలు రూపాయలు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు,కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## మంచి మనసున్న కంబాల సాయి తేజ విద్య దేశానికి అభివృద్ధిని అన్నారు

యాదాద్రి భువనగిరి జిల్లా ఏప్రిల్ 2 ( నేటి శుభోదయ)యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని కొత్త గుండ్లపల్లి గ్రామంలో కంబాల సాయితేజ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త గుండ్లపల్లి ప్రాథమిక పాఠశాల లో స్కూల్ విద్యార్థుల కు స్కూల్ బ్యాగ్ లు పంపిణి చేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, మరియు 7,8 వార్డ్ కౌన్సిలర్ లు పెలిమెల్లి లావణ్య శ్రీధర్ గౌడ్,పేరబోయిన సత్యనారాయణ యాదవ్ స్కూల్ ఛైర్పర్సన్ కంబాల నవనీత,హెడ్మాస్టర్ వెంకన్న మరియు టీచర్ వాని,మరియు కంబాల జహంగీర్,పాండు, పెరబోయిన మహేందర్, బండి అనిల్,బండ రాజు, ముక్కర్ల రాజు, కంబాల నరసింహ... మరియు గ్రామ యువత ఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది.

## బోనకల్‌లో ఘనంగా శోభాయాత్ర

బోనకల్ :: మండల కేంద్రంలోని బోనకల్ గ్రామంలో హిందూ బంధువుల ఐక్యతతో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శివాలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర సాయిబాబా గుడి వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం వరకు భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు, నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.శోభాయాత్ర హిందూ పండుగలలో భక్తి, ఐక్యత మరియు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన కార్యక్రమంగా నిలిచింది. ముఖ్యంగా శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి వంటి సందర్భాల్లో నిర్వహించే ఈ యాత్రలు ధర్మ ప్రచారం, సామాజిక సామరస్యం మరియు భగవంతుని పట్ల కృతజ్ఞతను తెలియజేస్తాయి.ఈ సందర్భంగా భక్తులు తమ భక్తి, విశ్వాసాలను బహిరంగంగా వ్యక్తపరచడంతో పాటు, హిందూ సంప్రదాయాలను తదుపరి తరాలకు అందించాల్సిన అవసరాన్ని వివరించారు. వేలాది మంది ఒకే చోట చేరి ప్రార్థనలు చేయడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో జరుగుతున్నట్లే బోనకల్‌లో కూడా కాషాయ జెండాలు, "జై శ్రీరామ్" నినాదాలతో శోభాయాత్ర వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన హిందూ బంధువులు భారీగా పాల్గొని విజయవంతం చేశారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఏప్రిల్ 02 నేటి శుభోదయ :బోధన్ పట్టణంలోని విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు.ఆయా తరగతి గదులను సందర్శించి పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు.విధులు నిర్వర్తిస్తున్న అధికారులు,సిబ్బందితో ఎవరైనా సెల్ ఫోన్లు తెచ్చారా అని ఆరా తీశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరు కూడా పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తేకూడదని,కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని నిర్వాహకులను ఆదేశించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు,ప్రథమ చికిత్స,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా,కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సీ.సీ కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల సీళ్లు తెరిచారా లేదా అని తనిఖీ చేశారు.కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మంగళ ఉన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**బీ.సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఏప్రిల్ 02 నేటి శుభోదయ :సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు.అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు.

